# సత్యనారాయణ చాలాకాలంగా కథలూ, గల్పా రాస్తున్నాడు.

## కథలేవో, గల్పలేవో యెత్తిచూపిన వాళ్ళెవ్వరూ ఆయన అభిమాన పాఠకుల్లో లేరు.



# అవగాహన

తులసీకృష్ణ

"ఇటాంటి కథ నేమెన్నడూ చదవలేదు." అలాంటి వుత్తరాల్ని తన రచనల కంటే జాగ్రత్తగా దాచుకున్నాడు మొదట్లో. తన రచనలకన్నా జాగ్రత్తగా దాచుకున్నాడనడంలో, రచయితగా సత్యనారాయణను అపహాస్యం చేయడం కాదు. అలా అనుకుంటే, సత్యనారాయణలో సహజ పరిణామాన్ని గుర్తించడం సాధ్యం కాదు. అట్లాంటి ఉత్తరాలే నిజంగా తన రచనకు 'యిన్స్పిరేషన్'గా భావించాడు. రాసిపారేసిన రచనలకంటే భావి రచనల్ని ప్రభావితంచేసే వుత్తరాలే ముఖ్యం కదా? ఇంతకు ముందటి తన రచనల్ని పరిశీలించి. అందులో లోపాలేమిటో, యేవి విడిచిపెట్టాలో. యేది విస్తృతం చెయ్యాలో. చెయ్యవలసి వుందని అనుకోలేదతను. అతని రచనల్ని సమీక్షించుకునే వోపిక అతనికి లేనప్పుడు పాఠకులకు మాత్రం యెందుకుంటుంది? వాళ్ళైనా అంత పనీ పంగూ లేనివాళ్ళా?

అయితే రానురానూ అట్లాంటి ఉత్తరాల మీదుంచుకున్న విశ్వాసం తగ్గిపోయింది. అది చాలా సిగ్గుచేటైన అనుభవం అతనికి. ఇట్లాంటి కథ నేనెన్నడూ చదవలేదు. పాఠకులు చాలా కథలకు అట్లాంటి ఉత్తరాలు రాయడం గమనించేసరికి ఆశ్చర్యపోయాడు. పాపం బాధపడిపోయాడు అసంతృప్తి విచారంతో. ఆ తర్వాత అట్లాంటి ఉత్తరాలు పర్సనల్‌గా వచ్చినవీ. పత్రికల్లో వచ్చినవీ. యెక్కడెక్కడ దాచినవీ జాగ్రత్తగా ఓపిగ్గా వెదకి తెచ్చి దొడ్డి వెనకాల బూడిద కుప్పమీద వేసి అగ్గిపుల్ల గీశాడు. "హైలైట్" ఉత్తరాలు కూడా అందులో వున్నాయేమో. మంట ఇంతేపని లేదింక. అది జరిగినాక చాలా డీలాపడిపోయాడు సత్యనారాయణ. కొంప కాలిపోయిన పేదవాడిలా వున్నాడు కొన్నాళ్ళు. తనలో రచన యెండిపోయినట్లు ఉండిపోయాడు. ఎప్పుడన్నా రాయాలని కూర్చున్నా పూర్తిగా రాయలేకపోయేవాడు. నా కోసమే నేను రాసుకుంటున్నానన్నవాడు రచయితో కాదోగానీ బాధలేని వ్యక్తి మది తన రచన తనకు బాగుండకపోవడం కూడా అసే జరిగేది కాదు. సత్యనారాయణ అట్లాంటి రచయిత కాదు. తన రచయితంటూ యెవరూలేని పాఠకులు వందలుండొచ్చుగానీ, తన పాఠకులంటూ యెవరూ లేని రచయిత వొక్కడుండటం కూడా సంభవంకాదనేదే సత్యనారాయణ అభిప్రాయం. తనకు వుత్తరాలు రాసినవాళ్ళే తనకున్న పాఠకులంతానా? తగలబడని పాఠకులు కొందరన్నా వుండొచ్చు. అయితే వాళ్ళెవరు? యెక్కడుంటారు? తన రచనల మీద వాళ్ళ అభిప్రాయం యేమిటి?


సత్యనారాయణ ఈ అన్వేషణలో వున్నప్పుడు దొరికిన వాడే నరసయ్య. నరసయ్య అసలు పేరు నరసింహయ్యలూ నాలోవున్న మృగాన్ని (సింహాన్ని) తీసేసి నరుడుగా మిగిలిపోయాను, పేరులోనే అనుకో, అని చెప్పుతూ అన్నాడొకసారి నరసయ్య సత్యనారాయణతో. నరసయ్యకు ముందరి పళ్ళులేవు. నెత్తిమీద జుట్టులేదు. చెంపల్లో కండల్లేవు, యిట్లా చాలా లేనివి గమనించాడు సత్యనారాయణ. అతని కున్నవేమిటో తెలుసుకునే వీలు మాత్రం కలుగలేదు. ఇన్నాళ్ళుగా నరసయ్యతో పరిచయమైనా, అతనెక్కడుంటున్నాడో, కుటుంబమెంతటిదో, యేం వుద్యోగం చేస్తున్నాడో. యింతకుముందునించీ ఈ వూళ్ళో వుంటున్నాడో, లేక యెప్పట్నించీ వుంటున్నాడో. ఈ వివరాలేమి యెన్నడూరాలేదు.

ఆ ప్రసక్తి తను తేలేదనడం కంటే, ముఖ్యంగా అవి మాట్లాడ్డం నరసయ్యకిష్టంలేదనే అనుకున్నాడు. అలా అనుకో డానికింకో కారణమూ వుంది. సత్యనారాయణ వ్యక్తిగత విషయాల్ని కూడా

యెన్నడూ ప్రసారించలేదు నరసయ్య. దేశంలో కోట్లాదిమంది ప్రజల బాధల్ని గురించి మాట్లాడేవాడు తరచూ. అప్పుడతన్ని చూడాలంటే కొంచెం భయం వేసేది. ముఖంలో నరాలు పగిలి నెత్తురు చిమ్ముతున్నట్లుండేది. ఒక్కొగా. పల్లెలో గడ్డివాముల మీద నాటే దిష్టిబొమ్మలా వుండే నరసయ్య ఉత్తేజంతో పురకలేస్తున్న మహా బలవంతుడిమాదిరి కనిపించేవాడు.

నరసయ్య పరిచయం మొటమొదట నాటక ప్రదర్శనం రోజు జరిగింది. సత్యనారాయణకు నాటక ప్రదర్శనాన్ని గురించిన పరిజ్ఞానం లేదు. సాహిత్యంలో నాటక, నాటిక ప్రక్రియలమీద కూడా అతని కభిమానంలేదు. అయినా నాటకం డైరెక్టు చేసిన సుబ్బారావు బలవంతంవల్ల వెళ్ళాడు. అది 'కళ్ళు' అన్న నాటకం. నాటకమంతా చూసేప్పటికి సత్యనారాయణ చాలా కదిలిపోయాడు. నాటక రచన గొప్పగా వుందనిపించింది. నటీనటుల్ని మనస్ఫూర్తిగా అభినందించాడు. అప్పుడు సుబ్బారావు హడావిడిగా నరసయ్యతోపాటువచ్చి "హల్లో! సత్యం!" అంటూ నరసయ్యవైపు తిరిగి "ఈయన నా స్నేహితుడూ, మంచి రచయిత సత్యనారాయణనీ" అంటూ, యిటు తిరిగి "ఈయన నరసయ్య, ఒకప్పుడు మంచి నటుడు" అంటోన్న మాటకు నరసయ్య నవ్వుతూ చెయ్యెత్తి తెగ్గొట్టినట్టు ఆపేసి, అదేచెయ్యి సత్యనారాయణ చేతో కలిపాడు. నరసయ్య మీద మంచి అభిప్రాయం కలగలేదు, సత్యనారాయణకు. రచయితని చెప్పినా, యెలాంటి కుతూహలం చూపకపోవడం అతనికి నచ్చని వొకానొక కారణం కావచ్చు. పరిచయం చేసినా, యెవరూ యేమీ మాటాడుకోకపోవడం వల్ల యిబ్బందిగా వుందేమో, సుబ్బారావు యింకొంచెం చొరవచేసి యిద్దర్నీ కలపాలన్నట్టు, "ఈమధ్య యేమీ రాయడంలేదా?" అన్నాడు.

"ఏదీ! తీరిక చిక్కడంలేదు" అన్నాడు సత్యనారాయణ. ఇంతకు ముందున్న తీరిక యిప్పుడూ వుండతకి. అప్పుడూ నరసయ్య ఆసక్తి చూపలేదు. సిగరెట్ తాగుతూ సిల్కాని, నటనటులు రంగు తుడుచుకోడం, బట్టలు మడిచిపెట్టుకోడం చూస్తూ వున్నాడు. తను సాధారణ ప్రేక్షకుడు మాత్రమే కాదన్నది తెలుపుకోవాలన్నట్లు




"నాటక రచన కూడా గొప్పగా వుంది" అన్నాడు సత్యనారాయణ.

"వుసు.. గొప్ప తప్పుడు అభిప్రాయం చెబుతోంది' అన్నాడు నరసయ్య.

"ఎట్లా?" అన్నాడు. కంఠంలో తీవ్రత పలికింది. వాతావరణం ఇట్లా మారడం సుబ్బారావు కిష్టంలేక నవ్వడానికన్నట్టు "నాటకం ఆంధ్రదేశంలో అనేకచోట్ల ప్రశంసలూ, బహుమతులూ పొందింది!" అన్నాడు.

'అయినాసరే!' అంటున్నాడు నరసయ్య. "నాటకం పనికిరాన్స, అదే నాటక ప్రయోక్త ముందండడం మంచిది కాదేమోలే" నవ్వుతూ అని సిగరెట్ పారవెయ్యడానికి హాలు గుమ్మం దగ్గరికి వెళ్ళాడు. లోపల్నుంచి సుబ్బారావునెవరో పిలిచారు. సుబ్బారావు 'గుడ్ నైట్' చెప్పి బయటికొచ్చాడు సత్యనారాయణ.

"నాటకంలోవున్న తప్పుడు అభిప్రాయమేమిటో చెప్పండి!" అన్నాడు, యిప్పుడు సౌమ్యంగా.

"మాట్లాడుకుంటూ వెళదాం" అన్నాడు నరసయ్య అన్నాడేకానీ. మాట్లాడుతున్నప్పుడు నడవలేదు నరసయ్య. కాళ్ళను ఆపేసి చేతుల్ని మాత్రమే ఆడిస్తాడు. ఊరికే చూసినప్పుడు యెంత సాదాగా, చవగ్గా కనిపిస్తాడో, మాట్లాడుతున్నప్పుడు అంత ఆకర్షిస్తాడు నరసయ్య. విత్తనం నించి మొలకెత్తి కొమ్మలూ రెమ్మలూవేసి శాఖోపశాఖలై విస్తరిల్లినట్టు అనిపిస్తుంది అతని ప్రసంగం.

"నాటకంలో రచయిత చెప్పిందేమిటి? కళ్ళున్న వాడికంటె కళ్ళులేనివాడు నైతిక విలువల్ని పాటిస్తారు. అందువల్ల మనిషికి కళ్ళు లేకపోవడమే మంచిది..."

మధ్యలోనే అందుకున్నాడు సత్యనారాయణ.

"అట్లా అనుకోడ మెందుకు. అది విపరీత వ్యాఖ్యానం. గుడ్డివాడిగావుండి చూపొచ్చిన వాడు డబ్బుపట్ల! అందంపట్ల ఆకర్షితుడు కావడం అసహజం కాదే!"

"సహజమైనంత మాత్రాన చాలదు. వ్యక్తిగతంగా సహజమైంది సామాజిక పరంగా యెంత అన్యాయం కలిగిస్తుందో దాన్ని రచయిత ప్రధానంగా గుర్తించవలసి వుంది. ఎవడో వ్యక్తి. అతని సంస్కారం ఆధారంగా జరిగిన సంఘటన్ని "కేస్" చేసుకుని, కళ్ళుండడంకంటే కళ్ళు లేకపోవడం మంచిదని చెప్పడం యెంత ఘోరం! అటా చెప్పాడానికి ఆ పాత్రకళ్ళు మళ్ళీ పొడిచెయ్యడమే వుదాహరణ! సుబ్బారావు చెప్పినట్టూ ఆ నాటకం యెన్నో ప్రశంసలూ, బహుమతులూ పొందిందంటే రచయిత కోరిక ప్రకారం ఆంధ్రదేశంలో ప్రజలు చాలా భాగం గుడ్డివాళ్ళయిపోయారేమో! గుడ్డివాళ్ళకు చూపు తెప్పించాలనుకోడం, కళ్ళదానాలు చేయడం, అర్థరహితం కాక అనర్థం కూడా తెస్తుందని రచయిత అభిప్రాయం పాత వైపున పలకడంలేదా! ఆకల్తో చచ్చేవాడికి, నీకు ఆకలుండటమే మంచిది, ఆకలి తీరడమనేది అంతమంచిది కాదని చెప్పడానికీ, దీనికీ యేమన్నా తేడా వుందా!"

సత్యనారాయణ మనస్సులో గింజుకుంటూనే వున్నాడు. నరసయ్య అభిప్రాయం సరైంది కాదేమోని వొకసారి నాటక రచయిత అభిప్రాయం కూడా యిప్పుడు చూసే తప్పుగానేవుందే నొకసారి అనుకున్నాడు. అదీ నరసయ్యతో మొదటి పరిచయం! ఎక్కడో యెక్కడో ఎదురుపడతాడు. ఏ హోటల్ దగ్గరుంటే అక్కడికి "కాఫీ తాగుదాం రండి!" అని దారితీస్తాడు సత్యనారాయణ. ఒక్కసారికూడా తిరస్కరించడు నరసయ్య. మాట్లాడకుండా అనుసరిస్తాడు.

"ఇప్పటి మన సామాజిక జీవితంలో కాఫీ హోటళ్ళే కల్చరల్ సెంటర్స్" అంటాడు. ఏ అంశం ప్రసంగంలో దొరినా నరసయ్య క్రమక్రమంగా వేడెక్కుతాడు. కాఫీ చల్లారిపోతుంది. నరసయ్యతో మాట్లాడమే వొక యెడ్యుకేషన్ అన్నట్లుగా మారిందిసత్యనారాయణ అభిప్రాయం. అయితే వొక అసంతృప్తికూడా లేకపోలేదు. సత్యనారాయణ నాలుగైదు నవలలూ వందలాది కథలూ రాశాడు. నరసయ్య అది గమనించకుండా వుండడు. అయినా



యెన్నడూ ఆ ప్రస్తావన తేలేదు. నరసయ్యంటే యిష్టం పెరిగే కొద్దీ యింకా కష్టంగా వుంది సత్యనారాయణకు. "నా రచనలు చదివారా? వాటిమీద మీ అభిప్రాయం యేమిటి?" అనడగడానికి సంకోచంగా వుంది.

"ఇవి నా రచనలు, చదివి మీ అభిప్రాయం తెలియజేయండి' అనివ్వడానికి అభిమానంగా వుంది. ఇన్నేళ్ళకు మంచి పాఠకుడు దొరికినా అతన్ని ఉపయోగపెట్టుకోడం సాధ్యం కాలేదు సత్యనారాయణకు. ఆలోచించగా ఒక మార్గం తట్టింది. ఇంతకు ముందటి రచనల్ని చదివించాలనుకోడం యెందుకు? ఇప్పుడేదన్నా కొత్త రచన చేసి చదివించొచ్చుగా. ఇది బాగుంది. సరీగ్గా అప్పుడే 'దర్పణం' పత్రికవాళ్ళు ప్రత్యేక సంచిక కోసం కథ రాయమని అడిగారు. ఉత్సాహం తెచ్చుకుని ఉపక్రమించాడు సత్యనారాయణ. కథ రాయాలని కూచున్నప్పుడు 'యెట్లాంటి కథ రాస్తే నరసయ్యచేత ప్రశంస పొందొచ్చును' అన్నది పదే పదే తలెత్తుతోంది. "ఇదేమిటి? ఒక్క నరసయ్య కోసమేనా కథ రాయడం?' అన్న ప్రశ్న వచ్చినా నరసయ్యను దూరం చెయ్యలేకపోయింది. తప్పేముంది? నరసయ్యంటే ఒక వ్యక్తి కాదు. ఉత్తమ అభిరుచి గలిగిన ఒక పాఠకవర్గం. పత్రికవాళ్ళు అడగడం ఒకవైపూ, నరసయ్య యింకో వైపు నిలవడంతో. సత్యనారాయణ తొందరగా కథ రాసి పంపాడు. కథ పేరు "నిజాయితీ" సత్యనారాయణ రచయితగా మొదట్లో పిచ్చి రచనలే చేసినా, తరువాత మారుతూ వచ్చాడు. బాధలు పడేవాళ్ళ పక్షంగా నిలవడం ధర్మమనుకున్నాడు. ఈ దృష్టితో రాసిందే యిప్పటి కథ. కథ చిన్నదే. రంగన్న రిక్షా తొక్కేవాడు. ఒకరాత్రి రెండో సినిమా విడిచిన తర్వాత అతని రిక్షాలో ఆడా, మొగా ఇద్దరెక్కుతారు. గొప్పోళ్ళతో బేరమెందుకనుకుంటాడు రంగన్న. వాళ్ళిద్దరి మాటల్లో వాళ్ళు బాగా డబ్బున్న వాళ్ళనీ, యిద్దరూ దంపతులు కాదనీ, యేదో లాడ్జిలో రాత్రి జల్సా చేసుకోడానికి వచ్చినవాళ్ళని. గ్రహిస్తాడు డబ్బులేక మధ్యాహ్నమూ, రాత్రి భోజనం చెయ్యని రంగయ్య వాళ్ళిద్దర్నీ కూచోబెట్టుకుని రిక్షా తొక్కడానికి శ్రమపడతాడు. వాళ్ళు పూరికే విసుక్కుంటారు. పైగా తిడతారు. అయినా రంగయ్య నోరెత్తడు. గొప్పవాళ్ళు లెమ్మనుకుంటాడు. ప్రేమించి పెళ్ళి చేసుకోలేకపోయినవాళ్ళే మోలే అనుకుంటాడు. అంతేకాదు, ఒకప్పుడు యౌవనంలోని తానూ, తన భార్య సుబ్బమ్మల పవిత్ర (?) శృంగార క్రీడలు తలుచుకుంటూ రిక్షా తొక్కుతాడు. లాడ్జి చేరుకున్న తర్వాత అతను అర్ధరూపాయి పారేస్తాడు. అన్యాయమంటోన్న రంగన్నను తిట్టి వాళ్లు తలుపు వేసుకుంటారు. ఉసూరుమంటూ వచ్చి లైటు స్తంభం దగ్గర రిక్షా నిలిపి, కొంచెం సేపు పడుకుందామనుకున్న రంగన్న రిక్షా సీటు సందులో నెక్లెస్ చూస్తాడు. చెమటలు కారుస్తూ మళ్ళీ రిక్షా తొక్కుకుని వెళ్తాడు. తలుపు కొట్టగా అతను తీస్తాడు. రిక్షా రంగన్నను చూస్తూనే, బాడుగ యింకొంచెం యెక్కువిమ్మని అడగడానికి మళ్ళీ వచ్చాడనుకొని 'ఛెళ్ళు'న చెంపమీద కొట్టాడు. రంగన్నలోని నిజాయితీలా తళతళమనే హారం అతని తాగుబోతు కళ్ళకు మెరుపులు చిమ్ముతుంది. అంటూ ముగిసింది కథ. ఈ కథ అచ్చువేసుకున్న పత్రిక కాపీ అందింది సత్యనారాయణకు. కానీ. నరసయ్యే ఈమధ్య యెక్కడా కనిపించలేదు. సత్యనారాయణకు ఆ కథ నరసయ్యచేత చదివించాలని ఆదుర్దాగా వుంది. ఒకరోజు ఉదయం తన యింటిమీదుగా పోతున్న సుబ్బారావు కనిపించాడు. కేకేసి పిలిచి, కాఫీ యిప్పించాడు. "నరసయ్య యిల్లెక్కడ?" అనడిగాడు. సుబ్బారావు విరక్తిగా నవ్వి "యేమో, ఆయనా వొక పిచ్చోడు; అన్నీ ఆయనొక్కడికే తెలుసుననుకుంటాడు" అన్నాడు. ఆనాటి సత్యనారాయణమీద సానుభూతిగా .. యిప్పటి కాఫీకి కృతజ్ఞతగా 'ఆ దానికేంలే, ఆయన అభిప్రాయం అదీ ...' 'యిల్లెక్కడో' అన్నాడు మళ్ళీ. "ఎక్కడో గొల్లవీధిలో నంట; నేనెప్పుడూ చూళ్ళేదు"

ఆ సాయంత్రం దర్పణం చేతబట్టుకొని రిక్షా యెక్కి గొల్లవీధికి బయల్దేరాడు సత్యనారాయణ. వెతగ్గా వెతగ్గా వొక పాక ముందు ఆర్. నరసయ్య, R.M.P. అన్న చిన్న బోర్డు కనబడింది. రిక్షావాన్నక్కడే వుండమని లోపలకి దూరాడు. నరసయ్య బెంచీమీద పడుకున్న ముసలామె కాలికేదో కట్టు కడుతున్నాడు. కొంచెం దూరంగా ఆడా, మగా కూర్చున్నారు.

"నమస్కారం" అన్నాడు సత్యనారాయణ.

"ఓహో రండి!" అని "చెన్నయ్యా లోపలి గదిలో స్టూలుంది పట్టుకురా" అన్నాడు. గోడవారగా కూచున్నవాళ్ళలో ఒకతను లేచి వెళ్ళి తెచ్చాడు. కట్టు కటడం పూర్తయింది. కూచున్న వారిలో ఒకతను లేచి నరసయ్య దగ్గరగావచ్చి నిల్చున్నాడు. "తీసుకెళ్ళు" అన్నాడు నరసయ్య. ముసలామె లేచి కూచుంది. "పత్తెమే ముండల సామీ" అంది. "పత్తెమా" అని నవ్వాడు నరసయ్య. "ఏమీ అవసరం లేదులే" అని గట్టిగా అని "ఇప్పుడు పెట్టేదేమిటి? జన్మ పత్తెం వుందిగా" అన్నాడు. కుర్చీ యెత్తి చెక్కబల్ల దగ్గరగా వేసి, "వన్ మినిట్" అంటూ చేయి కడుక్కోడానికి వెళ్ళాడు. అతను ఆమెను బెంచీమీద నించి అట్లానే యెత్తుకుని వెళ్తున్నాడు. సత్యనారాయణ ఆశ్చర్యంగా, కొంచెం అసహ్యంగా చూస్తున్నాడు. నరసయ్య చేయి తుడుచుకుంటూ వచ్చి, నిల్చొని చూస్తున్నాడు.

"రిక్షాలో తీసుకెళ్తాడేమో..." అన్నాడు సత్యనారాయణ. అదయినా అయితే కొంచెం నయం; భరించవచ్చు; అన్నట్టు "వగ్గరే మోసుకెళ్తాడు!" అన్నాడు నరసయ్య మామూలుగా. "అట్లానే వీధిగుండా...." అన్నాడు సత్యనారాయణ.

ఆశ్చర్యంకంటే అసహ్యమే ఎక్కువుంది అందులో.

"వీధిగుండానే... యేం?"

"భలే ....తమాషాగా వుంటుంది!" అని బిగ్గరగా నవ్వాడు సత్యనారాయణ. నరసయ్య మరుగ్గా చూశాడు. "హల్లో. అందరిముందు సినిమా హీరో, హీరోయిన్ని యెత్తుకుంటాడు. వీధుల్లో యెక్కడ చూసినా అవే బొమ్మలు కనిపిస్తాయి. అవి అసభ్యంగా అనిపించవు. కాని..." అంటూ ఆగిపోయాడు. తుడుచుకుంటున్న టవల్, తాటిమీద పడేసివచ్చి కూర్చున్నాడు. "ఊ" అని దీర్ఘమైన నిట్టూర్పు విడిచి ముఖంలో కులాసా తెచ్చుకుని, సత్యనారాయణ కేసి చూశాడు.

ఏమిటా పుస్తకం?"

"దర్పణం" అనే మాసపత్రిక అంటూ, నరసయ్య చేతికిచ్చాడు. అట్లా తిరిగిలేదు. సత్యనారాయణ చూస్తోన్నాడు.

"మీదీ కథ వుందే!" అమ్మయ్య! కళ్ళు బడింది.

"ఆ .. వుంది, యేవో వాళ్ళడిగారు" అన్నాడు తేలిగ్గా.

"చూడ్డానికి వీలవుతుందా?"

"వుంచండి. యెప్పుడో తీసుకుంటాను"

"రిక్షాలో వచ్చారేమో... పంపెయ్యండి వెళ్ళొచ్చుగానీ!" సత్యనారాయణ చకచకా లేచి బైటికెళ్ళి చూశాడు. రిక్షా వాడెక్కడా లేడు. "అరె! డబ్బుతీసుకోకుండా వెళ్ళిపోయాడే!" అనుకుంటూ ప్యాంటు వెనకాల జేబులో చెయ్యి పెట్టుకున్నాడు. పర్సులేదు. రిక్షా యెక్కిన స్పృహ వుంది.

"రిక్షా అతను ఆ మెసేమైనా తీసుకెళ్ళాడేమో"

సత్యనారాయణ ముఖం చూశాడు నరసయ్య.

"ఏం? యేమైంది?" అన్నాడు తొందరగా

"పర్సు కనిపించలేదు!" అన్నాడు నవ్వుతూ.

"ఎంతుంది?"

"ఎంతో లేదులే... రెండు పది కాగితాలు రెండు రూపాయి కాగితాలు" బైటకన్నంత సులభంగా లేదు లోపల నిజానికి. కథకు రెమ్యూనరేషన్ పోయింది.

రిక్షావాణ్ణి బాగా గుర్తుపట్టచ్చు. స్ఫోటకం మచ్చలూ. కణతమీద కాలిన మచ్చ వుంది"

చటున చూశాడు నరసయ్య. సత్యనారాయణ ఆశగా చూసేసరికి.

"ఆ... అవును బాగా గుర్తు పట్టచ్చు!" అన్నాడు.

ఆ తర్వాత ఒకటి రెండేసి నిమిషాలు మాట్లాడినా సత్యనారాయణలో డబ్బు పోయిన దిగులుపోలేదు.

"అయితే మీరు డాక్టరన్నమాట!" అన్నాడు.

"అప్పు! డాక్టరు దగ్గరికి వెళ్ళలేని వాళ్ళు నాదగ్గరికొస్తారు గనుక నేను డాక్టర్నికాను" అన్నాడు నవ్వుతూ. కొంచెంసేపు వూరుకుని గోడలూ పైన బోదకప్పుచూసి, సరే ... నేనొస్తాను" అని లేచాడు సత్యనారాయణ

"మంచిది!" అన్నాడు నరసయ్య.

అక్కణ్ణించి ఇంటికొచ్చే టప్పుడు తనమీద తనకే కోపమొచ్చింది సత్యనారాయణకు. ఎందుకొచ్చిన అవస్థ! పుస్తకం తనే మోసుకెళ్ళి యిచ్చి. అభిప్రాయం తెలుసుకోవాలన్న ఆరాట మెందుకు? అందుకే డబ్బుకూడా పోయె. ఇటా అనుకున్న సత్యనారాయణ ముందో రోజు సాయంత్రం మళ్ళా ఆ వీధికేసి బయలేరాడు. అయితే... ఇటా వొంగ్ వెళ్తాననుకున్నాడు. తర్వాత యెట్లాగూ ఈ వీధి కొచ్చానుగదా. నరసయ్యున్నాడేమో చూదామనుకున్నాడు. "ఈ దారంటవెళ్తూ. వున్నారేమోని యిటా వచ్చాను" అందామనుకునే ఆలోచనకూడా చేశాడు. కానీ, ఆ అవసరం కలగలేదు. సత్యనారాయణ సరీగ్గా నరసయ్య యింటిముందరి కెళ్ళేసరికి, యింట్లోంచి వొక మనిషి "సర్రున" బైటికొచ్చాడు. పక్కకు జరిగిన సత్యనారాయణ తలెత్తి అతన్ని చూసేసరికి స్ఫోటకం మచ్చలు కణతమీద కాలిన మచ్చ! ఇతను...వీడు! అవును వాడే! "ఎయ్...రేయ్...ఆగు! ఆగు!" అతను వొక్క క్షణం తడబడ్డాడు. తెలిసి చేసినపనికి వెనకాల తెలీని బలమేదో పటి ఆపబోతోంది. మొండిగా ముందుకు దూసుకొని పోయాడు.

"నీకేచెప్పేది ...ఆగు! దొంగలంజా కొడకా! పట్టుకోండి." అరుస్తున్నాడు. నరసయ్య బైటికొచ్చాడు.

"ఉండండి. యెక్కడికి పోతాడు? పోలీసులకు పట్టిస్తాను. దొంగ గాడిద కొడుకు!" వుద్రేకంతో ముందుకు దూకబోయాడు సత్యనారాయణ.

"లోపలికిరండి, డబ్బుంది. ఇంట్లోకి దారి తీశాడు నరసయ్య.

చిన్నారి పాపల కోసం!
అందమైన కార్టూన్లతో నాలుగు రంగుల బాపు ముఖచిత్రంతో,
ఆకర్షణీయంగా ప్రచురింపబడిన మా నాలుగు పిల్లల నవలలు!

సుఖీభవ
పాతూరి ప్రసన్నం * వెల రు: 5.00

అమ్మ కావాలి
శ్రీమతి ధనం * వెల రు 4.00

బంగారు తల్లి
పాలంకి వెంకట రామచంద్రమూర్తి వెల రు 5.00

ఉడుతా ఉడుతా హూత్
యం. ఫిరోజమ * వెల రు 5.00

మీ సమీపంలో గల పుస్తకాల షాపుల్లో పై పుస్తకాలను అడగండి. లభించకపోతే మాకు వ్రాయండి, రు. 20.00 పంపినవారికి పై నాలుగు పుస్తకములు రిజిష్టర్డు పోస్టులో పంపబడతాయి!

హారిస్ హిందీ డిక్షనరి
వెల రు 3.30

న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్
ఏలూరు రోడ్డు * విజయవాడ-2



# ఆంధ్రజ్యోతి పాఠకులకు దీపావళి శుభాకాంక్షలు

చిత్రం : గోలి శంకరరావు, హైదరాబాద్

'ఆ....డబ్బుందా? యిచ్చేశాడన్నమాట' లోపలికి వచ్చి చూచున్నాడు. బెంచీమీద వొక కుర్రవాడూ, మధ్య వయస్కురాలూ మాత్రమే వున్నారు.

"ఇర వైరెండు కదూ?" బల్ల సొరుగు నించి తీస్తూ అన్నాడు నరసయ్య

"అదేమిటీ? మీరు గానీ యిస్తున్నారా?"

"లేదు ...వాన్దగర్నించీ మొన్ననే తీసుకున్నాను.

"పోలీసులకు పట్టిస్తే బావుండేది. వాళ్ళని క్షమించడం కూడా తప్పే!

నరసయ్య నవ్వాడు.

"జాతిగా నీతి, నిజాయితీ లేదు వెధవలకి?"

బిగ్గరగా నవ్వాడు నరసయ్య. సత్యనారాయణ ఆశ్చర్యంగా చూశాడు.

"ఏం లేదు రిక్షావాడి నిజాయితీ గురించి గొప్పగా రాసిన రచయితే రిక్షావాన్ని నిజాయితీ లేని వెధవ అని తిడుతూంటే...."

"అయితే రిక్షావాళ్ళంతా దొంగలని రాయాలంటారా? లేక దొంగతనం చేసినా వీళ్ళ మెచ్చుకోవాలంటారా?"

నరసయ్య మాటాడలేదు. సత్యనారాయణ కూడా ఒక్క నిముషం వూరుకుని "కథ చదివారన్నమాట!" అన్నది గురుకొచ్చి నేరుగా రంగంలోకి దిగాడు.

"ఇంతకూ నా కథమీద కచ్చితమైన మీ అభిప్రాయమేమిటి?"

"మీ కథమీద అభిప్రాయం మీ డబ్బు దొంగతనం చేసిన రిక్షా అతను చెప్పేశాడు. అంతకంటే అధికారం మీకు లేదు నైతికంగా."


"అంటే నిజాయితీ అన్నది అర్థం లేనిదనా?"

"నిజాయితీకి మీ రిచ్చే అర్థమేమిటి? మీరు పోగొట్టుకున్న డబ్బు మీకు తెచ్చి యివ్వడం. అంతవరకే మీరు నిజాయితీకి హద్దు గీసుకున్నారు."

"కాకి? వాడి జేబులో వేసుకోడంకూడా నిజాయితీలోకే చేర్చుకోవాలా?" అవహేళనగా అన్నాడు.

"అవును. ఒక్కోసారిచేర్చుకోడం కూడ అవసరమని మీరు ఆలోచించరు. మీడబ్బు కొట్టేసిన రిక్షా అతని బాధలూ, బాధ్యతలూ నాకు తెలుసు. ఎవరి డబ్బుతోనైనా, అతని తల్లి ప్రాణాలు కాపాడుకోడం. కనీసం ప్రయత్నించడం నిజాయితీలోకి చేర్చుకోరు. దొంగతనం చేయకుండా వుండడానికి వీల్లేని అతని నిస్సహాయత్వాన్ని అర్థం చేసుకోకుండా, అతను మోయలేని నీతిని, మంచి గుణాల్ని నెత్తికెత్తుతారు. మంచిగుణాలనేవి పేదవాళ్ళుగా వుండడంలోనే వున్నట్లు అభిప్రాయం కల్పించే సాహిత్యం వుంది మనకు. పీడితులపక్షంగా రాస్తున్నా మనుకుంటారు వీళ్ళు. అంతకంటే ద్రోహం ఏముంది? నా అభిప్రాయంలో యీ రిక్షా అతను, మీ కథలో రంగన్న కన్నా. అట్లాంటి కథల్రాసే రచయితల కన్నా. నిజాయితీ అయినవాడు .. ? సత్యనారాయణ వులికి పడ్డాడు, కోపమొచ్చింది. దీనికి తిరుగులేదు....అన్నట్లు చూస్తున్నాడు నరసయ్య. అయినా యేమని వాదించాలో తోచడంలేదు. సుబ్బారావన్నమాట జ్ఞాపకమొస్తోంది.

"ఆయనా వొక పిచ్చోడు"— కాకపోతే అనుకోడంతో సత్యనారాయణ మళ్ళా నిలదొక్కుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. ★



Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada-10. Editor Narla Venkateswara Rao